క్లుప్తంగా

ఓసీ-2లో క్రేన్ ప్రారంభం



క్రేన్‌ను ప్రారంభిస్తున్న ఏరియా జీఎం దుర్గం రాంచందర్

మణుగూరుటౌన్: ఏరియాలోని ఓసీ-2లో రూ.1.44 కోట్లతో టెర్రెయిన్ భారీ క్రేన్‌ను జీఎం దుర్గం రాంచందర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యంత్రాలను నైపుణ్యతతో నడిపి చిన్న మరమ్మతులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. యంత్ర శబ్దాన్ని విని సమస్య గుర్తించే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసచారి, వెంకట్రావు, మదన్‌నాయక్, రాంబాబు, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ నాయకులు గట్టయ్య, సీఎంఓఏఐ బ్రాంచి అధ్యక్షుడు కే.కృష్ణమూర్తి, సురేశ్, శ్రీనివాస్, రాజశేఖర్, శ్రీనివాస్, పిట్ సెక్రటరీలు, డంపర్ సెక్షన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంఈఓగా బాధ్యతలు స్వీకరణ

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మండల విద్యాధికారిణిగా కీసర లక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన ఎంఈఓకు స్థానిక ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓగా సమ్మయ్య

చర్లరూరల్: చర్ల మండల విద్యాశాఖ అధికారిగా (ఇన్‌చార్జ్) ఎస్.సమ్మయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. చర్లతో పాటు దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపాడు మండలాల ఇన్‌చార్జ్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

కార్డు ఉత్తర్వులు రద్దు చేయాలి

మణుగూరుటౌన్: యాజమాన్యం ఇటీవల జారీ చేసిన పసుపు కార్డు, ఎరుపు కార్డు ఉత్తర్వులు నిరంకుశమైనవని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మణుగూరు ఏరియా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈ సర్క్యులర్ అమలుతో కార్మికులు విధి నిర్వహణలో భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ప్రైవేట్ కన్వేయన్స్ డ్రైవర్ల జీతాలు విడుదల చేయాలని, పీవీకాలనీలో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు వై.రాంగోపాల్, సిల్వేరు గట్టయ్య, సుమన్, కొడిపల్లి శ్రీలత, భుక్యా కిషన్, నాజర్‌పాషా, మంగీలాల్ తదితరులు ఉన్నారు.

పూర్తయిన శిక్షణ తరగతులు



తరగతులకు హాజరైన అంగన్‌వాడీ టీచర్లు

ములకలపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నూతన విద్యావిధానంపై నిర్వహిస్తున్న మూడురోజుల శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. జగన్నాథపురం, పొగళ్లపల్లి సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు స్థానిక రైతువేదికలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దమ్మపేట సీడీపీఓ జ్యోతి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ట్రైనీ వరలక్ష్మి, సూపర్‌వైజర్ నాగమణి, టీచర్లు పాల్గొన్నారు.

జగన్నాథుడికి పూజలు

అశ్వాపురం: జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా ఒరిస్సా వాసులు మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో గుండి చాఘర్ మందిరంలో జగన్నాథుడికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. హేరా పంచమి కార్యక్రమం నిర్వహించారు. జగన్నాథుడు, భలభద్రుడు, సుభద్రాదేవి దేవతా మూర్తులకు ఉదయం 9గంటలకు నిత్య పూజ, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న పూజ, సాయంత్రం 7 గంటలకు భజన, కీర్తన, సాయంత్ర పూజ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ నెల 15న జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు ముగియనున్నాయి.

నేడు జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

మణుగూరుటౌన్: బొగ్గు బ్లాకుల వేలం రద్దు చేసి సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ జీఎం కార్యాలయం ఎదుట నేడు ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

డ్రెయినేజీ నిర్మాణాలపై సందిగ్ధత

- చంద్రుగొండలో విస్తరణపై కుదరని ఏకాభిప్రాయం
- నిర్ణీత అడుగులకు అధికారుల నిర్ణయం
- తమ నిర్మాణాలపై ప్రభావం పడుతుందంటున్న స్థానికులు



గ్రామస్తుల తరఫున మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామారావు

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండ గ్రామంలో జూలూరుపాడు రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీల నిర్మాణంపై సందిగ్ధత కొనసాగుతోంది. డ్రెయినేజీ పనులకు రోడ్డును ఎన్ని అడుగులు విస్తరించాలనే అంశంపై అధికారులకు, స్థానికుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడమే ఇక్కడ సమస్య.

నేపథ్యమిది..

రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీల నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.3.20 కోట్లు నిధులు మంజూరు చేసింది. అయితే నిబంధనల ప్రకారం రోడ్డుకు రెండు వైపులా కలిపి 100 అడుగులు వెడల్పు చేయాల్సి ఉంది. అంటే ఒక్కో వైపున 50 అడుగుల చొప్పున వెడల్పు చేయాల్సి ఉంటుంది. కాగా, 50 అడుగుల మేరా విస్తరిస్తే వ్యాపార సముదాయలతోపాటు తమ గృహాలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లితుందని గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో జోక్యం చేసుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గండుగులపల్లిలోని తన ఇంట్లో ఇటీవల గ్రామస్తులతో సమావేశం అయ్యారు. వారి సమస్యను విని.. 33 అడుగులకు తగ్గిస్తే సరిపోతుందని గ్రామస్తులకు సూచించారు. కానీ, ఆ మేరకు కూడా స్థానికులు ప్రస్తుతం అంగీకరించడం లేదు. 28 అడుగుల వెడల్పు చేస్తే మాత్రమే తమ ఇళ్లు, నిర్మాణాలు నిలుస్తాయని అభిప్రాయపడుతున్నారు. కాగా, కనీసం 30 అడుగులు తీయాల్సిందేనని అధికారులు చెబుతున్నారు.

మార్కింగ్ పనుల అడ్డగింత

విస్తరణ విషయంతో వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో తాజాగా గురువారం రోడ్లుభవనాల శాఖ సిబ్బంది 30 అడుగులు వెడల్పుకు మార్కింగ్ ఇచ్చే పనులు చేపట్టారు. రంగప్రవేశం చేసిన స్థానికులు ఆ పనులను అడ్డుకున్నారు. 28 అడుగులకు కుదించాల్సిందేనని కోరారు. ఇదిలా ఉండగా.. సమస్యపై కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో ఫోన్‌లో చర్చించినట్లు సమాచారం.

స్పష్టత వచ్చేనా?

రోడ్డు వెడల్పు చేసే అంశంపై వాదపవాదనలు కొనసాగతుండగా.. వివాదం ఓ కొలిక్కి రావాల్సి ఉంది. స్పష్టత రానిపక్షంలో మంజూరైన నిధులు వెనక్కు మళ్లే అవకాశం ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో మరో రెండురోజుల్లో డ్రెయినేజీల నిర్మాణలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

28 అడుగులకు అభ్యంతరం లేదు..



గతంలో రోడ్డు పనులు గ్రామం చివరి నుంచి పారంభించి మధ్య నిలిపివేశారు. అయితే డ్రెయినేజీ పనులను ప్రధాన సెంటర్ నుంచి చేపట్టాలి. 28 అడుగులు వెడల్పు చేస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.

– భోగి కృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు

మా ఇళ్లు పోతున్నాయి..



మా ఇల్లు, మాతోపాటు అనేక ఇళ్లు రోడ్డు విస్తరణలో పోతున్నాయి. అయినప్పటికీ గ్రామం అభివృద్ధి కోసం 28 అడుగులు వెడల్పు చేస్తే మాకు సమ్మతమే. అధికారులు సానుకూలంగా వ్యవహరిస్తారని భావిస్తున్నాం.

– కడియాల నాగేశ్వరరావు, బాధితుడు

మా పరిస్థితి అర్థం చేసుకోవాలి



ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గారు మా పరిస్థితిని అర్థం చేసుకోవాలి. 33 అడుగులు తీస్తే కొందరి ఇళ్లు పూర్తిగా నేలమట్టమౌతాయి. ఇక్కడున్న పరిస్థితిని బట్టి చర్యలు తీసుకోవాలని మేము కోరుతున్నాం.

– కుదురుపాక రమేష్, బాధితుడు

మెనూ ప్రకారం భోజనం అందించాలి



హాస్టల్ వార్డెన్ తీరును ఫోన్‌లో డీడీకి వివరిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, చిన్న అస్వస్థతకు లోనైనా విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని సమితిసింగారం గిరిజన బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్ పరిసరాల్లో తిరిగి పరిసరాల పరిశుభ్రతను తనిఖీ చేశారు. పిల్లలకు ఏర్పాటు చేసిన భోజనాన్ని పరిశీలించారు. చిన్న మరమ్మతుకు గురైన ఆర్‌ఓ ప్లాంట్‌ను పట్టించుకోలేదని వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్ నిర్లక్ష్య తీరుపై డీడీకి ఫిర్యాదు చేశారు. వెంటనే ప్లాంటుకు మరమ్మతులు చేయించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బాలుర వసతి గృహంలో నెలకొన్న పలు సమస్యలతో పాటు ప్రహరీ గోడ నిర్మించాలని విన్నవించారు. వెంటనే సంబంధిత అధికారులను నిర్మాణానికి నివేదిక అందించాలని సూచించారు. కార్యక్రమంలో గుడిపూడి కోటేశ్వరరావు, కూచిపూడి బాబు, గాండ్ల సురేశ్, పాతూరి వెంకన్న, మహబూబ్ పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మండలానికి చెందిన మానస, పి.రాధ, అజ్మీర తేజశ్రీ, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎం.నారాయణలకు రూ.2లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా.. వాటిని గురువారం ప్రజాభవన్‌లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ బస్ సీజ్

చర్ల: మండలంలోని ఆర్ కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సుకు సంబంధించి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఆర్టీసీ కిషన్‌రావు గురువారం సీజ్ చేశారు. బస్సు ఫిట్‌నెస్ లేకపోవడంతో కేసు నమోదు చేసి చర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆర్‌టీఓ తెలిపారు.

15న పెన్షనర్ల సమస్యలపై నిరసన

భద్రాచలంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 15న జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ బంధు వెంకటేశ్వరరావు ఓ ప్రకటన విడుదల చేస్తూ.. నిరసనను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చల్లగుల్ల నాగేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎంవీఎస్ నారాయణ, కొత్తగూడెం జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జోగయ్య ఉన్నారు.

తలసేమియా బాధితుడికి రక్తదానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన 10 ఏళ్ల బాలుడు తలసేమియా వ్యాధితో బాధపడుతుండగా.. ప్రతీ 15 రోజులకు ఓ సారి ఏ పాజిటీవ్ రక్తం ఎక్కించాల్సి ఉంది. కుటుంబ సభ్యులు పట్టణంలోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు మురళిని ఆశ్రయించగా.. ఆయన అభ్యర్థన మేరకు భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై మధుప్రసాద్ రక్తదానం చేశారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మారుతీనగర్‌లో గ్రామ శివారులో శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మం స్వామి వారి నూతన ఆలయ నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. అంతకుముందు స్వామి వారికి పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు దివిలి కామేష్‌రావు, గుంటముక్కల అప్పలరాజు, హేమాల సత్యనారాయణ, కార్పెంటర్ యూనియన్ అధ్యక్షులు కుందవరపు రమేష్, సోమాని రాజా రమేష్, చంద్రపట్ల ఆంజనేయ చారి, లక్కోజి శ్రీను, ఈశ్వర చారి పాల్గొన్నారు.

సాయి ఆలయంలో పూజలు

దుమ్ముగూడెం: గ్రామంలోని శ్రీ దత్తశేష సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. బాబా వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరగగా.. మండలానికి చెందిన గాజుల శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. అన్నదాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు సతీమణి సుబ్బలక్ష్మి, కుమార్తె హర్షిత, చీకట్ల సతీష్–స్నేహ దంపతులు పాల్గొన్నారు.

పనులను అశ్రద్ధ చేయొద్దు



గుంపెనగూడెంలో నిల్వ నీటి తొలగింపును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సుధీర్

చర్లరూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న క్రమంలో పారిశుద్ధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు అశ్రద్ధ వహించవద్దని డీఎల్‌పీఓ యం.సుధీర్ సూచించారు. గురువారం చర్ల మండలంలోని చర్ల, కొయ్యూరు, కేశవాపురం పంచాయతీల్లో విస్తృతంగా పర్యటించారు. గుంపెనగూడెం గ్రామం వద్ద ప్రధాన రహదార్లపై నిలిచి ఉన్న నీటిని తొలగించారు. దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీ కె.ఈదయ్య, ఎంపీఓ ఎస్‌కె.వలి హజరత్, కార్యదర్శులు కృష్ణ, శ్రీకాంత్, ఉదయ్‌కుమార్‌లు ఉన్నారు.

డీఎస్సీని అడ్డుకోవడం సరికాదు..

అశ్వాపురం: పదేళ్లు నిరుద్యోగులను పట్టించుకోకుండా లీకులతో కాలం గడిపిన బీఆర్‌ఎస్ పార్టీ.. కాంగ్రెస్ ప్రభుత్వం డీఎస్సీకి పరీక్షలు జరుపుతుంటే ధర్నాలతో అడ్డుకోవడం అవివేకమని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ఓరుగంటి రమేష్ విమర్శించారు. మండల కేంద్రంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు తమ ఉనికి కోసం తాపత్రయ పడుతున్నారని అన్నారు.

జనాభా నియంత్రణపై అవగాహన



పినపాక: అవగాహన ర్యాలీలో వైద్యాధికారిణి దుర్గాభవాని, ఉద్యోగులు

చర్లరూరల్: మండలంలోని కొయ్యూరు పీహెచ్‌సీలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా.. వైద్యాధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పూజ, వైద్య సిబ్బంది రామలక్ష్మి, హనుమంతు, రాంప్రసాద్, రామకృష్ణ, నరసింహారావు, గోపి, సరస్వతి, ఉమ, సుశీల, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పినపాక: స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి కుటుంబ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బందితో కలిసి పినపాక ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి దుర్గ భవాని మాట్లాడుతూ.. కుటుంబ నియంత్రణ ప్రతి ఒక్కరి ఆమోదంతోనే సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. కాన్పుల మధ్య దూరం ఉంటేనే తల్లి బిడ్డలకు శ్రేయస్కరమన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

మణుగూరురూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్, శ్రీవిద్య టెక్నో జూనియర్ కళాశాలల్లో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నల్లగట్ల సత్యప్రకాష్ మాట్లాడుతూ.. ప్రతీ పౌరుడు జనాభా నియంత్రణ పద్ధతులు, జనాభా పెరుగుదల వల్ల కలిగే దుష్ప్రరిణామాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆయా కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి మీరాహుస్సేన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ పద్మ, అధ్యాపకులు సురేష్, కృష్ణ, శ్రీవిద్య కళాశాల కరస్పాండెంట్ పి.శంకర్, ప్రిన్సిపల్ పి.నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ సభ్యులు అడబాల నాగేశ్వరరావు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతపై ఆసక్తి పెంచుకోవాలి



ఫ్లో బస్‌లో పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జూపల్లి రమేష్

అశ్వారావుపేటరూరల్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని, భవిష్యత్ దీనిపైనే ఆధారపడి ఉంటుందని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫ్లో బస్సు గురువారం స్థానిక వీకేడీవీఎస్ ప్రైవేట్ కళాశాలకు చేరుకుంది. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై కళాశాల, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ఫ్లో బస్ ఫౌండర్, సీఈఓ మధులాష్‌బాబు సైన్స్ అండ్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, సీఐ కరుణాకర్, కళాశాల ప్రిన్సిపాల్ శేషుబాబు, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, తుమ్మా రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు హరిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలతో ఆర్థిక భరోసా

దుమ్ముగూడెం: పోస్టల్ శాఖ సేవలతో ప్రజలు ఆర్థిక భరోసా పొందాలని భద్రాచలం నార్త్ సబ్ డివిజన్ పోస్టల్ శాఖ ఏఎస్పీ ఐ.అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో భద్రాచలం పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పోస్టల్ శాఖ ద్వారా అందుతున్న సేవలను వివరించారు. అందులో ముఖ్యంగా గ్యాగ్ పాలసీ, ఇన్సూరెన్స్ పాలసీల గురించి వివరించారు. పొదుపు బీమా సేవలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక భరోసా పొందాలని సూచించారు. ఐపీపీబీ మేనేజర్ జగదీష్, మెయిల్ వర్సెస్ దుర్గాప్రసాద్, గోపాల్, సీతారాంపురం బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ కోటిరెడ్డి, పోస్టల్ సిబ్బంది సాగర్, మైత్రి, నవ్య, కిరణ్, పవన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో నూతన చట్టాలపై గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ.. కొత్త చట్టాలతో బాధితులకు సత్వర న్యాయం అందుతుందన్నారు. మహిళలు, చిన్నపిల్లలపై జరిగే అఘాయిత్యాల్లో సమాచారం అందించే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. నేరం చేయడమే కాదు.. నేరం చూసి చెప్పకపోవడం కూడా చట్టరిత్యా నేరమేనన్నారు. సమావేశంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనరెడ్డి, ఎస్సై మాచినేని రవి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత పాల్గొన్నారు.

డెంగీ అనుమానిత గ్రామాల్లో పర్యటన



జ్వర బాధితుడి వద్ద డాక్టర్ శ్రీధర్

చర్లరూరల్: కొయ్యూరు పీహెచ్‌సీ పరిధిలోని డెంగీ అనుమానిత (ఎస్ఎస్ 1) గ్రామాల్లో గురువారం వైద్యాధికారి శ్రీధర్, వైద్య సిబ్బంది పర్యటించారు. కొయ్యూరు గ్రామ పంచాయతీలో జ్వరాలు సోకిన ఇళ్లకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. దోమల మందును స్ప్రే చేయించి, నీటి నిల్వలను తొలగించారు. వ్యాధులు ప్రబలుతున్న క్రమంలో తీసుకోవలసిన జాగ్రత్తలను స్థానికులకు వివరించారు.

మొక్కలు నాటిన ఎంపీపీ

అశ్వాపురం: మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత పాల్గొని మొక్కలు నాటారు. పాఠశాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీఓ శ్రీనివాస్, ఉపాధి హామీ ఏపీఓ సీతారామయ్య, ఏఈ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వేణుప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు జోలికి పోవద్దు

ములకలపల్లి: యువత గంజాయి వంటి మత్తుపదార్థాల జోలికి పోవద్దని జెడ్పీటీసీ సున్నం నాగమణి, ఎంపీటీసీ శనగపాటి మెహరమణి సూచించారు. ములకలపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. యువతీ యువకులు, మైనర్లు సైతం గంజాయికి బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

చర్లరూరల్: మండలంలోని సింగ సముద్రం డే కేర్ సెంటర్‌లోని 120 మంది పేద విద్యార్థులకు గురువారం గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, స్కూలు బ్యాగులు, పెన్నులు, గిఫ్ట్ బాక్సులను చర్ల మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో చైల్డ్ కేర్ సెంటర్ ఇన్‌చార్జ్ పూజారి లక్ష్మీనారాయణ, సంస్థ ప్రతినిధులు మురళీ కృష్ణారెడ్డి, సతీష్, దొడ్డా ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి నివాళి



దమ్మపేట కోర్టులో మౌనం పాటిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

దమ్మపేట: అకస్మాత్తుగా వచ్చిన గుండెపోటుతో మరణించిన అదనపు ఎస్సై సీమ నాయక్ చిత్రపటానికి.. దమ్మపేట ఎస్సై సాయికిషోర్, పోలీసు సిబ్బంది గురువారం ఘనంగా నివాళులర్పించారు. దమ్మపేట స్టేషన్‌లో మృతుడి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఈ మేరకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై ప్రతాప్ రెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, మాధవ చారి, రామకృష్ణ రెడ్డి, రమేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

దమ్మపేట కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అదనపు ఎస్సై సీమ నాయక్, ఇటీవలే ఆత్మహత్య చేసుకున్న అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్‌ల చిత్రపటాలకు పూలతో నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు మారం సతీష్‌కుమార్, ఉడతనేని శ్రీనివాసరావు, లక్కినేని నరేంద్ర, గొంది మురళీ మోహన్, భవాని కృష్ణ, సంధ్య, దర్గావళి, అరుణ, బాలరాజు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో న్యాయవాదుల నిరసన



మణుగూరురూరల్: నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



భద్రాచలంఅర్బన్: జడ్జి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్.

మణుగూరురూరల్: సిద్ధిపేటలో న్యాయవాదిపై పోలీసులు జరిపిన దాడిని ఖండిస్తూ మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్ట్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దాడికి పాల్పడిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు కందిమళ్ల నర్సింహారావు, పానుగోటి కిషన్‌రావు, సర్వేశ్వరరావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, నగేష్‌కుమార్, పోశం భాస్కర్, జాడి చొక్కయ్య, రుద్ర వెంకట్, సంధ్య, వాసవి పాల్గొన్నారు.

న్యాయమూర్తికి వినతిపత్రం..

భద్రాచలంఅర్బన్: సిద్ధిపేటలో న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని గురువారం భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఎఫ్‌సీ న్యాయమూర్తి వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం న్యాయవాదులు కోర్టు ఎదుట నినాదాలు చేస్తూ, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చైతన్య మాట్లాడుతూ.. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పూసాల శ్రీనివాసచారి, జాయింట్ సెక్రటరీ విద్యాదారి, గ్రంథాలయ కార్యదర్శి పేరాల వెంకటేశ్వర్లు, మాజీ ఏజీపీలు గొడపర్తి నాగరాజు, పడిసిరి శ్రీనివాసరావు, రావి రాంమోహన్ రావు, కాపుల ప్రకాష్, బందారు రమేష్, అరుణశ్రీ, తాతా లలిత, భాసం శారద, ఉప్పు గౌతమ్, దాట్లసంధ్య, మాలవి, అంజలి, విజ్జగిరి, రవితేజ, రాంబాబు పాల్గొన్నారు.